

# అమెరి'కాకమ్మ'కథలు

## వంగూరి చిట్టెన్ రాజు



## "నేనూ, రాకుమారీ, పొట్టి రాక్షసుడూ"

అమెరికాకమ్మ కథలు- 17

(వందలాది విశిష్టమైన కథలూ, ఇతర రచనలు విస్తృతంగా చేసినప్పటికీ, 1954లో "తోకచుక్క" తో మొదలుపెట్టి, 1978లో "భల్లూక మాంత్రికుడు" వరకూ అద్భుతమైన జానపద ధారావాహిక కథలని సృష్టించి అనేక తరాల పాఠకులహృదయాలలో సజీవంగా ఎప్పటికీ నిలిచిపోయే 'చందమామ' శ్రీ దాసరి సుబ్రమణ్యం గారు ఇటీవలే పరమపదించారు. వారి దివ్యస్మృతికి ఈ అమెరి"కాకమ్మ" కథ అంకితం")

**అనగనగా కాకినాడలో** ఓ చిట్టి రాజు అనే కుర్రాడు పుట్టాడు. పసివాడిగా ఉన్నప్పుడు తల్లిదండ్రులు అతన్ని తూ.గో జిల్లాలో కిర్లంపూడి దగ్గర ప్రా. దొంతమ్మూరు అనే గ్రామం తీసుకెళ్ళే వారు. ఎందుకంటే అది కుర్రాడి తాత గారు పెరిగిన ఊరే కాక, మేనత్తలు కూడా ఉండే ఊరన్నమాట. అప్పటికీ, ఇప్పటికీ చిట్టి రాజుకి ఊరి పేరులో ఉన్న ప్రా. అంటే ఏమిటో, ఎందుకో తెలియదు. కానీ ఒకే జిల్లాలో నాలుగైదు గ్రామాలు ఒకే పేరుతో ఉంటే, ప్రతీదానికీ ఏదో ఒక మకుటమో, తోకో తగిస్తారుట. ఉదాహరణకి, చిట్టిరాజు నాలుగో క్లాసులోకి వచ్చినప్పుడు అందులో నలుగురు హనుమంత రావులు ఉండే వారు. అంచేత వారి వాలకాన్ని బట్టి ఒకడు పొట్టి కోతి, బొండాంలా ఉండే వాడు గుండు గాడూ, పొడుగ్గా గిట్టసరిగా ఉండే వాడు తాడిచెట్టు గాడు, సూది ముక్కులా ఉండేవాడు గునపం గాడూ అనే విశేషణాలు ఉండేవి. అలాగే ఈ ప్రా. అంటే కూడా ఏదో కారణం ఉండే ఉంటుంది.

అదంతా ఎందుకు కానీ దొంతమ్మూరులోనే "లోకారెడ్డి వారి చెరువు ఇస్తువా పంపు అనే శేరీ" అనే రెండు వందల ఎకరాల మా పొలాలూ, "మిరాశీ" అనే నాలుగు వందల ఎకరాల మా మేనత్తల పొలాలూ చిట్టి రాజు నాన్న గారే చూశే వారు కాబట్టి తను పసివాడిగా ఉన్నప్పుడు అక్కడ పెరిగాడు. ఆ రోజుల్లో పెరగడం అంటే ఈ రోజుల్లోలాగా పుట్టడానికి ముందే ఎల్.కె.జి ఫీజులు కట్టేసి, తెలుగు పుస్తకాలు బయటకి విసిరేసి, ఇంగ్లీషు నేర్పడానికి అమెరికా టీవీ ప్రొగ్రాముల ముందు చిన్నప్పటినుంచీ కూచో పెట్టేయడం కాదు. పైగా లింగు, లింగు మంటూ ఒకరో, ఇద్దరు మాత్రమే పిల్లలు కూడా కాదు. చిట్టి రాజుకి స్వంత అన్నదమ్ములూ, అప్పచెల్లెళ్ళూ, బంధువర్గంలో ఉన్న పిల్లలూ వెరసి పాతిక మంది పైగా కలిసే పెరిగే వారు. ఎవరు ఎవరి పిల్లలో తూకం వేసుకుని ప్రకారం పెంచే ప్రణాళికలు లేవు.

చిట్టి రాజు పసితనంలో రోజూ పొద్దున్నే అందరితో బాటూ స్నానం చేయించేసి, పౌడరు రాసేసి, బొట్టు పెట్టేసి, అతని బామ్మ గారి వంద కాసుల పేరు మెడలో వేసేసి, గోడ మీద నుంచి పక్కింట్లో ఉన్న వెలమ దొరల రాణీ గారికి అందించే వారు. ఎందుకంటే, ఎందుకో గానీ రాణీ గారికి తెల్లగా, బొద్దుగా ఉండే ఈ రాజా వారంటే చాలా ఇష్టంగా ఉండేదిట. ఈ మాట చెప్పగానే "సరేలే, చిన్నప్పుడు అందరూ అలాగే ఉంటారు. సొంత పిల్లడైతే బొద్దుగా, ఎంచక్కా అంటారు. పరాయివాడైతే బొండాం అనీ ఎద్దులా ఉన్నాడనీ అందరూ అనుకునేదే. కొంత మంది పెద్దయ్యాక మొద్దులా తయారవుతారు" అని తన అభిప్రాయం చెప్పింది మొన్న చిట్టి రాజు భార్య, విక్టోరియా మహారాణీ.

తనకి తెలుగు చదవడం, రాయడం వచ్చిన తరువాత, ఒక రోజు చిట్టి రాజు దొంతమ్మూరులో తమ మేడ మీద రెండో అంతస్థులోకి వెళ్ళాడు ఆడుకోడానికి. అక్కడేమో రెండు పెద్ద గదులున్నాయి. అందులో ఒక గదిలో రెండు పెద్ద భోషాణం పెట్టెలున్నాయి. ఎలాగో కష్టపడి, ఒక పెట్టె మూతని తెరిచాడు చిట్టి రాజు. అంతే, అతని కళ్ళు జిగేలుమన్నాయి. ఎందుకంటే అందులో రంగు, రంగు బొమ్మలతో పెట్టెనిండా పుస్తకాలు కనపడ్డాయి. అప్పుడే చదవడం నేర్చుకున్నాడేమో, కుతూహలం పట్టలేక ఒక పుస్తకం తీసుకుని, నేల మీద చతికిలపడి చదవడం మొదలు పెట్టాడు. అలా ఎంతసేపయిందో తెలియదు కానీ, మేడ క్రింద అంతస్థులోంచి "ఎక్కడికి పోయాడో ఈ వెధవ" అని అరుపులూ, గందరగోళం వినపడుతున్నాయి. ఇంతలో వాళ్ళ అమ్మ మేడమీదకి వచ్చి చిట్టి రాజుని చూసి "ఓరి వెధవా? ఇక్కడేం చేస్తున్నావ్?" అని అతని చేతిలో ఉన్న పుస్తకం చూసి "ఓ, చందమామ చదువుతున్నావా? కానీ, పరవాలేదు. ఆకలెయ్యగానే క్రిందకి వచ్చియ్ భోజనానికి" అని ఆవిడ సంతోషంగా చిట్టి రాజుని ఏమో అనకుండా క్రిందకి వెళ్ళి పోయింది. అప్పటినుండి, ఈ నాటి దాకా చిట్టి రాజు "చందమామ" చదవడం మానలేదు.

రాత్రి "కాల భంజకా, కంకాళా, చతుర్నేత్రుణ్ణి పట్టి హతమార్చండి" అని అరుస్తూ చిట్టి రాజు పెద్ద కేకలు పెడుతూంటే వాళ్ళ అమ్మ "ఏరా, ఏమయింది. ఏమయినా పీడ కల వచ్చిందా?" అని గట్టిగా తట్టి నిద్ర లేపింది. నిద్రలో కళ్ళు నిలుముకుంటూ మేడ మీదనించి బయటకు చూడగానే మసక చీకటిలో ఎదురు గుండా వంద గజాల దూరంలో రోడ్డుకి అవతల వేపున మంత్రాల దీవి, పక్కనే జిల్లేళ్ళ దిబ్బ, చుట్టూ భయంకరమైన మొసళ్ళతో ఉన్న మందాకినీ సరస్సు, దాని ఒడ్డున ఊడల మర్రి భయంకరంగా ఒళ్ళు విరిచుకుని ఆవలిస్తోంది. వెంటనే వాళ్ళమ్మని కావిలించుకుని కళ్ళు మూసుకున్నాడు చిట్టి రాజు.

మర్నాడు మధ్యాహ్నం భోజనాలయ్యాక "అమ్మా, ఆడుకోవడాని వెళ్తున్నా" అని సరస్సు దగ్గరకి పారిపోయాడు చిట్టి రాజు. అప్పటికే పొట్టి గాడూ, గునపం, తాడి గాడూ, గుండు హనుమంత రావూ కూడా అక్కడికి చేరారు, రోజూ లాగానే. "ఒరేయ్, ఇవాళ మనం కొత్త ఆట ఆడతాం. నేనేమో సమరసేనుణ్ణి. ఆ తాడి హనుమా గాడేమో ఏకాక్షి గాడు. గుండు గాడేమో చతుర్నేత్రుడు. ఇప్పుడేమో అదిగో పైన ఆకాశంలో తోకచుక్క పొడిచింది, కనపడిందా?" అంటూ సరికొత్త ఆట సృష్టించాడు చిట్టి రాజు. అంత వరకూ క్రికెట్టూ, కబాడీలు తప్ప ఇలాటి ఆటలు తెలియని వాళ్ళందరూ "వీళ్ళందరూ ఎవర్రా, వింటుంటేనే భయం వేస్తోంది" అని తాడి గాడూ, గునపం గాడూ, అందరూ చిట్టి రాజుని అడిగారు. "మా ఇంట్లో ఎన్నో చందమామ పుస్తకాలు ఉన్నాయిలే" అని గొప్పగా చెప్పి చిట్టి రాజు అందరికీ కత్తీ, డాలూ, బాణాలూ, కాల సర్పం, నల్ల గుడ్లగూబ, పుర్రెల దండా, కుచ్చులటోపీ లాంటి కొత్త, కొత్త వస్తువులూ, ఆయుధాలూ ఎలా ఉంటాయో చేతులూపుకుంటూ, కళ్ళు తిప్పుకుంటూ చెప్పి, అన్నీ తయారు చేసుకుని అందరూ చీకటి పడే దాకా

ఆడుకున్నారు. ఆ తరవాతి రోజుల్లో, "అస్తమానూ నువ్వేనేమిటి, చిత్రసేన మహారాజు, ఈ సారి నేను వేస్తాను, నువ్వు పొట్టి రాక్షసుడు వెయ్యి" అని దెబ్బలాడుకునే వారు చిట్టి రాజూ, అందరు హనుమంత రావులూ.

తరువాత ప్రొ. దొంతమ్మొరు వెళ్ళినా, వెళ్ళకపోయినా చిట్టి రాజు జీవితమూ, అతనితో అతని మిత్రుల ఆటలూ, పాటలూ చందమామ చుట్టూనే తిరిగాయి. మకర దేవతా, పొట్టి రాక్షసుడూ, గీక్షసుడూ, దొంగముచ్చూ, పరోపకారి పాపన్నా, బండ రాముడూ, శూరసేన మహరాజూ, జిత్తుల మారి నక్కా, తెనాలి రామలింగడూ, కీలు గుర్రం, పట్టువదలని విక్రమార్కుడూ, అతనికి మౌనభంగం కలగగానే శవంతో సహా మాయమయిన బేతాళుడూ, అమర సింహుడూ, ఇలా ఒకరేమిటి కొన్ని వందల పాత్రలలో ఊహా విహారం చేసేవాడు చిట్టి రాజు. మహా భారతమూ, రామాయణమూ, ఇంచుమించు అన్ని ఇతిహాసాలూ నీతి కథలూ చందమామలోనే చదువుకున్నాడు. వాహినీ వారి "యోగి వేమన", షావుకారు,నమ్మిన బంటూ, మరియు "శ్రీ బి.వి. రామానందంగారి ఆధ్వర్యాన తయారగుచున్న మార్గ దర్శకమగు మహోజ్జ్వల చిత్రము "గొల్ల పిల్ల", "అద్భుతమగు కథావస్తువు, ఒడలు జలదరించజేసే ఘట్టములు, తహతహ పుట్టించు సన్నివేశాలూ, మధురాతిమధురమైన ప్రణయ దృశ్యాలూ"" మొదలైన సినిమా ప్రకటనలూ చిట్టి రాజు చందమామలోనే చూసి మురిసిపోయాడు. ఉషా కుట్టు మిషనూ బాగా పనిచేస్తుందనీ, "పాదముల దురద తగుటకు నికోడెర్మ్ వాడాలనీ, తన శరీర సువాసనకి వైజయంతి మాల రెమీ పౌడర్ మాత్రమే వాడుతుందనీ, మాధుర్య జీవితానికి కేడ్ బరీస్ చాక్‌ణ లెట్స్ తినాలనీ, పండ్లరుచు గల పాపిన్స్ పిప్పర్ మెంట్స్ తినాలనీ తెలుసుకోడానికి చందమామ చదవాల్సిందే "తాజ్ మహల్ నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు ఖర్చు అయిందని నేనూ, తొమ్మిది కోట్లు అయిందని నా మిత్రుడూ వాదించుకుంటున్నాం. మీరు ఎవరితో ఏకీభవిస్తారూ?" అనే పాఠకుల ప్రశ్నకి " ఇప్పట్లో తాజ్ మహల్ అమ్మకానికి రాదు కాబట్టి, దాని నిర్మాణానికి ఎంత ఖర్చు అయితే మనకెందుకు మిత్రమా" అనే కొంటె జవాబులూ చందమామ లోవే! ఇక అద్భుతమైన వ.పా, చిత్రా మొదలైన వారి బొమ్మలు ఇప్పటికీ చూడగానే గుర్తుపట్టెయ్య గలడు చిట్టి రాజు.

అసలు చందమామలో "కాకమ్మక్క కథలు" చదివాకే చిట్టి రాజుకి కాకులగురించి చాలా విషయాలు తెలిశాయి. అసలు కాకుల పుట్టుక గురించి చిన్న కథ ఉంది. ఒక ఊళ్ళో ఇద్దరు చిన్న పిల్లలు ఉండే వారు. వాళ్ళు చిన్నప్పటి నించీ విపరీతమైన అల్లరి పనులు చేస్తూ ఊరంతా గందరగోళం సృష్టించే వారు. వాళ్ళ బాధ భరించ లేక వాళ్ళని ఏమైనా సరే చంపెయ్యాలని గ్రామస్థులు నిశ్చయించుకుని వాళ్ళని పట్టుకోడానికి తరిమి కొట్ట సాగారు. కానీ పిల్లలిద్దరూ ఊళ్ళో ఉన్న కాళికా దేవి ఆలయానికి పారిపోయి, ఆవిడ విగ్రహం వెనకాల దాక్కున్నారు. ఊరి వారందరూ కూడా అక్కడికి వచ్చి వెతుకుతూ ఉండగా, ఒక పిల్ల విగ్రహం వెనకాల నుంచి గొంతు మార్చి "వాళ్ళని ఏమో చెయ్యకండి. నేనే వాళ్ళకి తగిన శిక్ష వేస్తాను. మీరందరూ ఇళ్ళకి వెళ్ళిపోండి" అని కాళికా దేవి మాట్లాడినట్టే భ్రమ పెట్టారు. దాంతో ఊరి వాళ్ళందరూ వెళ్ళి పోగానే, పిల్లలిద్దరూ బయటకి వచ్చేసి నవ్వుకుంటూ ఉండగా, కాళికాదేవికి కోపం వచ్చింది. "నేను మాట్లాడినట్టుగా మోసం చేస్తారా? చూడండి మిమ్మల్ని ఏం చేస్తానో ?" అని కోపంగా పిల్లలతో పలికింది. వాళ్ళిద్దరూ గట్టిగా నవ్వి "నువ్వా? పెద్ద నాలిక వేసుకుని, పెద్ద పులి మీద కూచుని వికారంగా ఉన్నావ్. నువ్వు మమ్మల్నేం చెయ్యగలవు?" అని కాళికాదేవిని వేళాకోళం చేశారు. దాంతో అమ్మ వారికి కోపం వచ్చి, ఒక పెద్ద బొగ్గు తీసుకుని, వాళ్ళిద్దరికీ నల్ల రంగు పులిమి, పక్షులుగా మార్చేసింది. అప్పటినించీ అవి "కావు, కావు" మంటూ గగ్గోలు పెడుతూ ప్రపంచం అంతా తిరుగుతూ ఉంటాయి. అందుకే భరించ లేని శబ్దానికి కాకి గోల అంటారు. అందుకే కాకులకి నల్ల రంగు తప్ప మరొక రంగు ఉండదు.

చిట్టి రాజులా "చందమామ" సృష్టించిన ఊహా లోకంలో పెరిగి, ఇప్పటికీ విహరిస్తున్న వారు వాళ్ళు ప్రపంచంలో అన్ని దేశాలలోనూ. అన్ని తరాల వాళ్ళూ ఉన్నారు. ఊహాలోకానికి ఊపిరి పోసి, ప్రాణ ప్రతిష్ట చేసిన దాసరి సుబ్రమణ్యం గారు ఇక లేరు అంటే ఇక "కాకమ్మ" కథలెలా చెప్పగలదు! మొన్న కొడుకుతో మూడు గంటల సేపు చూసిన "అవతార్" సినిమాలో కనీసం మూడు నిముషాలు కూడా అలనాటి "చందమామ" ఉత్సుకతలో వెయ్యో వంతు కూడా లేని విషయం తల్చుకుని "అయ్యో, మా పిల్లలకి మా చిన్ననాటి మహాభాగ్యం లేదే" అని విచారపడ్డాడు చిట్టి రాజు.

"మరి చిన్నప్పుడు నువ్వు కీలు గుర్రం మీద వెళ్ళి పొట్టి రాక్షసుడి బారి నుంచి కాపాడిన రాకుమారి ఎవరూ? ఎప్పుడూ చెప్పలేదేం" అడిగింది విక్టోరియా మహారాణీ.

"అదా, చెప్పడానికేముందీ? రోజుల్లో మగ పిల్లల్నీ, ఆడ పిల్లల్నీ కలిసి ఆడుకోనిచ్చేవారు కాదు. అసలు అలా కంబైన్డ్ గేమ్సూ, స్టడీసూ ఉండేవి కాదు. ఎవరి గోల వారిదే అందుకే యూవార్ లక్కీ" అనేసి పారిపోయాడు చిట్టి రాజు టెంకి జల్ల నుంచి తప్పించుకోడానికి. ***

